సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 24 । జూలై । 2025



రైతులకు నాణ్యమైన నారు

వైఎస్సార్ ఉద్యాన వర్సిటీలోని పరిశోధన శిక్షణా కేంద్రంలో తయారుచేసిన నారును రైతులకు అందిస్తున్నామని వర్సిటీ వీసీ కె.గోపాల్ తెలిపారు. 8లో ▸



కుళాయి కనెక్షన్లకు వసూళ్లు

భీమవరం మండలంలోని తాడేరులో కూటమి నాయకులు కుళాయి కనెక్షన్లకు గ్రామాభివృద్ధి కమిటీ పేరుతో డబ్బులు వసూలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 8లో ▸



భార్యను చంపిన భర్త అరెస్టు

చేపల చెరువు అమ్మకానికి భార్య అడ్డుపడుతోందని కక్ష పెంచుకుని హత్య చేసిన భర్తను కలిదిండి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు బాల్య దశ నుండే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.రత్నప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక సీఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్‌లో లీగల్ లిటరసీ క్లబ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య దశలోనే విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగించడం కోసం ప్రతి తరగతి నుంచి ఒక్కొక్క విద్యార్థిని ఎన్నుకొని వారికి చట్టాలపై అవగాహన కలిగించి వారి ద్వారా తరగతిలోని విద్యార్థులకు చట్టాలపై మరింత అవగాహన కలిగించడానికి ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 18 పాఠశాలల్లో ఈ లీగల్ లీటరసీ క్లబ్స్ పనిచేస్తున్నాయని, ఏలూరులో సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్, జడ్పీ హైస్కూల్ శనివారపు పేట, చాటపర్రు పాఠశాలలను ఎన్నుకొని ఈ లీగల్ లిటరసీ క్లబ్‌లను ఏర్పాటు చేసి తద్వారా విద్యార్థులకు చట్టాలపై సంపూర్ణ అవగాహన కలిగించడం కోసం న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీవీఎస్ మునీశ్వరరావు, న్యాయవాది పి.రత్నరాజు సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ పి.సాయి కుమారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి తోపుడు రిక్షాలు



బుట్టాయగూడెంలో తోపుడు రిక్షాలను వినియోగంలోకి తీసుకొచ్చిన దృశ్యం

సాక్షి స్పందన

బుట్టాయగూడెం: బుట్టాయగూడెంలో గ్రామాల్లోని తడి, పొడి చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించే విధంగా గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసిన తోపుడు రిక్షాలు నిరుపయోగంగా ఉండడంపై సాక్షి దినపత్రికలో బుధవారం 'నిరుపయోగంగా తోపుడు రిక్షాలు' అనే శీర్షికపై అధికారులు స్పందించారు. తోపుడు రిక్షాలను మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. త్వరలోనే అన్ని రిక్షాలను కూడా మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తామని కార్యదర్శి యు.దేవప్రియుడు తెలిపారు.

ఫిజియోథెరపిస్ట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని కుక్కునూరు, నిడమర్రు భవిత క్లబ్‌ల పరిధిలోని 6 భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపిస్ట్‌లుగా పని చేయడానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ కే పంకజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాచిలర్ ఆఫ్ ఫిజియో థెరపీ, మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ అర్హత ఉన్నవారు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 29 వరకూ ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నెలకు రూ.12,600 గౌరవ వేతనం అందిస్తామని తెలిపారు.

ఆడబిడ్డకు అన్యాయం

- 19 నుంచి 59 ఏళ్ల మధ్య మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని హామీ
- జిల్లాలో 5.96 లక్షల మందికి అర్హత
- గతేడాది రూ.1,073 కోట్లు ఎగ్గొట్టిన చంద్రబాబు సర్కారు
- మంత్రి అచ్చెన్న వ్యాఖ్యలతో మహిళల్లో ఆందోళన
- ఇప్పటికే తల్లికి వందనం కొర్రీలతో నష్టపోయిన మహిళలు



- ప్రతి మహిళకి నెలకు రూ.1500 (19 సం॥ నుంచి 59 సం॥ వరకు)



పాలకొల్లులోని ఒక కుటుంబంలో ఇద్దరు మహిళలకు ఏడాదికి రూ.36 వేలు సాయం అందుతుందని అందజేసిన బాండ్ పేపర్

సాక్షి, భీమవరం: ఆడబిడ్డ నిధి కోసం ఎదురుచూస్తున్న పేద మహిళల ఆశలపై టీడీపీ ముఖ్య నేత, కీలక మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు నీళ్లు చల్లాయి. ఈ పథకాన్ని అమలు చేస్తే ఆంధ్రాను అమ్మాలన్న సంచలన వ్యాఖ్యలతో ఆడబిడ్డ నిధి అమలు లేనట్టేనని స్పష్టం చేశారు. ఎంత ఖర్చవుతుందో ఎన్నికలప్పుడు తెలియదా అని కూటమి తీరుపై మహిళలు మండిపడుతున్నారు. అధికారంలోకి రావడమే ఆలస్యం 2024 జూన్ నెల నుంచే 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వరకు పేద మహిళలకు నెలకు రూ. 1500 చొప్పున ఏడాదికి రూ. 18000 ఆర్థిక సాయం అందిస్తామని కూటమి హామీ ఇచ్చింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు జిల్లాలో ఎక్కడకు వచ్చినా ఇదే విషయాన్ని ఊదరగొట్టారు. బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారంటీ పేరిట ప్రజలకు పంచిన బాండ్లలో సైతం ఈ పథకం కింద కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరుతుందో పేర్కొన్నారు. సీఎంగా చంద్రబాబు, డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్‌లు పాలన చేపట్టి ఏడాది పూర్తయినా ఈ పథకంపై నోరుమెదపడం లేదు.

ఆడబిడ్డ నిధిపై నీలినీడలు

సూపర్ సిక్స్‌లోని హామీని అమలు చేయకుండా చంద్రబాబు సర్కారు అన్యాయం చేసింది. ఈ హామీని అటకెక్కించే ప్రయత్నాలు చేస్తున్నట్టు కనిపిస్తోంది. ఈ పథకం అమలుచేయాలంటే ఆంధ్రాను అమ్మాలంటూ.. మంగళవారం మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. ఇప్పటికే తల్లికి వందనం అర్హులకు కూటమి ఎగనామం పెట్టింది. జిల్లాలో అర్హులైన విద్యార్థులు 2,29,106 మంది ఉండగా ఇప్పటివరకు 1,87,990 మందికి మాత్రమే సాయం జమచేసింది. ఒక్కో విద్యార్థికి రూ.13 వేలకు గాను కొందరికి రాష్ట్ర వాటాగా రూ. 8500 నుంచి రూ.9000 మాత్రమే ఇచ్చింది. కేంద్రం వాటా త్వరలో జమవుతుందని మెసేజ్‌లు పంపి చేతులు దులుపుకుంది. ఆడబిడ్డ నిధి పట్టాలెక్కించకుండానే పక్కనపెట్టే వ్యాఖ్యలపై మహిళలు భగ్గుమంటున్నారు. ఎంత ఖర్చవుతుంది? పథకం అమలుకు ఆదాయ వనరులు ఏమిటి? అనే విషయం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టే ముందు తెలియదా? అని ప్రశ్నిస్తున్నారు.

తొలి ఏడాది రూ.1073 కోట్ల నష్టం

సార్వత్రిక ఎన్నికల నాటికి జిల్లాలో 7,51,313 మంది మహిళ ఓటర్లు ఉన్నారు. వృద్ధాప్య పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారులు 1,26,061 మంది ఉండగా వారిలో మహిళలు 60 శాతం ఉంటారని అంచనా. ఈ మేరకు ఓఏపీ లబ్ధిదారులు 75,636 మంది ఉండగా, వితంతు 49,564, సింగిల్ ఉమెన్ 6,926, అభయహస్తం 8,908, దివ్యాంగులు సుమారు 14000 మంది కలిపి మహిళ లబ్ధిదారులు 1,55,034 మంది ఉన్నారు. వీరిని మినహాయించి కూటమి మేనిఫెస్టో మేరకు జిల్లాలో ఆడబిడ్డ నిధి పథకానికి 5,96,279 మంది అర్హులు ఉంటారని అంచనా. ఈ మేరకు నెలకు రూ. 89.44 కోట్లు చొప్పున గత ఏడాది కాలానికి రూ.1073 కోట్లు మేర ప్రభుత్వ సాయాన్ని ఆడబిడ్డలు నష్టపోయారు.

మహిళలకు మేలు చేసిన జగన్ సర్కారు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం తదితర పథకాల ద్వారా పేద మహిళలకు జగన్ సర్కారు అండగా నిలిచింది. ఆసరా కింద జిల్లాలోని 2,70,380 మంది డ్వాక్రా మహిళల రూ.1,107 కోట్ల రుణాలను మాఫీ చేశారు. 45 నుంచి 60 ఏళ్ల లోపు బీసీ మహిళలకు ఏడాదికి రూ. 18,750 చొప్పున జిల్లాలోని సగటున 61,750 మంది మహిళలకు నాలుగేళ్లలో రూ.4 63.41 కోట్ల సాయాన్ని అందించారు. కాపు నేస్తంగా కాపు, బలిజ, ఒంటరి, తెలగ సామాజిక వర్గాలోని సుమారు 28,004 మంది మహిళలకు నాలుగేళ్లలో రూ.168.02 కోట్లు, ఈబీసీ నేస్తంగా క్షత్రియ, రెడ్డి, కమ్మ, బ్రాహ్మణ, వైశ్య తదితర ఓసీ సామాజికవర్గాల్లోని 12,827 మంది పేద మహిళలకు గత నాలుగేళ్లలో రూ. 57.71 కోట్ల సాయం అందజేశారు.

మహిళలను మోసం చేయడం తగదు



ఆడబిడ్డ నిధి కింద మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఇప్పుడు మంత్రి అచ్చెన్నాయుడు మాటలు వింటుంటే పథకం అమలు చేయరని అర్థమైపోయింది. ఎన్నికల్లో మహిళలకు హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేయడం ప్రభుత్వానికి తగదు.

– కావలి రామసీత, కౌన్సిలర్, నరసాపురం

మోసం చేయడం టీడీపీకి అలవాటే



హామీలు ఇచ్చి మోసం చేయడం టీడీపీకి, చంద్రబాబునాయుడికి అలవాటే. ఆడవారికి పథకాలు ఇవ్వాలంటే చేతులు రావడం లేదు. ఆడబిడ్డ నిధి రూ.1500 ప్రకటించి 13 నెలలుగా అమలు ఊసేలేదు. ఇప్పుడు ఇస్తారో లేదో వారికే తెలియడం లేదు.

– పోతంశెట్టి లక్ష్మి, పెంటపాడు

ఏ హామీనీ అమలు చేయడం లేదు



ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయడం లేదు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తానని చెప్పారు. అధికారం చేపట్టి 14 నెలలు కావొస్తున్నా ఇచ్చిన హామీని అమలు చేయలేదు.

– బుడితి శ్రీలత, అత్తిలి

హామీలు అమలు చేయకపోతే దిగిపోవాలి



మాటపై నిలబడి తత్వం కూటమి ప్రభుత్వానికి లేదు. హామీలకు కరపత్రాలు, గ్యారంటీ బాండ్లు పంపిణీ చేశారు. మహిళలను మోసం చేయడానికే రూ.1500 ఆడబిడ్డ నిధి అంటూ ఎన్నికల్లో ఊదరగొట్టారు.ఇచ్చిన హామీల అమలు చేతకాకపోతే దిగిపోవాలి.

– రావూరి వెంకటరమణ, మాజీ ఎంపీపీ, యలమంచిలి

ప్రజల దృష్టిని మరల్చేందుకే అక్రమ కేసులు



యలమంచిలిలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి: ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టులు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) విమర్శించారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు నాయకత్వంలో యలమంచిలి సెంటర్‌లో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ నినాదాలు చేశారు. పార్టీ నాయకులు ఎంపీపీ వినుకొండ ధనలక్ష్మి రవికుమార్, చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, చల్లా విశ్వేశ్వరరావు, గుడాల సురేష్, మల్లుల కొండ, వీరా ఉమా శంకర్, నల్లి సంధ్యారాణి, తోట సుబ్బారావు, మోకా నరసింహారావు, పులి వెంకట సుబ్రహ్మణ్యం, మల్లుల బుజ్జి, విప్పర్తి సత్యనారాయణ, కాకుమళ్ల ఆంజనేయులు, దిడ్ల రాజబాబు, వినుకొండ చిన్న, మానుకొండ సోమరాజు, రామేశ్వరపు రఘు, శీలం రామారావు, గాడి దుర్గాప్రసాద్, గుబ్బల వాసు, బుంగా జయరాజు పాల్గొన్నారు.

శ్రీవారి దేవస్థానం శృతి విద్వాన్‌పై ఫిర్యాదు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానంలో నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న శృతి విద్వాన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ, తోటి ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదుపై ఆలయ అధికారులు విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. దేవదాయ శాఖ నియమావళికి విరుద్ధంగా ఓ వ్యక్తి ఆలయంలో పదేళ్లుగా శృతి విద్వాన్ విధులు నిర్వర్తిస్తున్నాడని, నాదస్వరం ఊదకుండా మోసం చేస్తున్నాడని, మరో శృతి విద్వాన్ కృష్ణమూర్తి ఇటీవల ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తికి ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణాధికారిగా ఏఈఓను నియమించారు.

రాష్ట్రంలో అసురుల పాలన

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు
- యలమంచిలిలో పాలకొల్లు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం



యలమంచిలిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, చిత్రంలో గుడాల గోపి, కవురు శ్రీనివాస్, ముదునూరి మురళీకృష్ణంరాజు

యలమంచిలి: రాష్ట్రంలో అసురుల పాలన నడుస్తోందని, వారి పాలనలో మంచి వాళ్లకు కష్టాలు తప్పవని నరసాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. స్థానిక తమ్మినీడి ఉమా నరసింహ కల్యాణ మండపంలో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో మోసపూరిత హామీలకు పేటెంట్ ఉన్న ఏకైక నాయకుడు చంద్రబాబు అన్నారు. చంద్రబాబు ఏనాడు ఒంటరిగా పోటీచేసి గెలిచింది లేదన్నారు. పాలకొల్లులో గత మూడు పర్యాయాలుగా ఓడిపోతున్నా మొక్కవోని విశ్వాసంతో పని చేస్తున్న కార్యకర్తలంతా వజ్రాలేనన్నారు. 2029లో మన పార్టీ అధికారంలోకి వచ్చాక కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు నూతన కమిటీలు వేస్తున్నామన్నారు. ఈ సారి సభ్యత్వంతోపాటు బీమా కూడా ఉంటుందని ప్రసాదరాజు చెప్పారు.

ఒక్క హామీ పూర్తిగా నెరవేర్చలేదు: గుడాల గోపి

పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. జగన్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో నవరత్నాలు అమలు చేశారన్నారు. ఏడాది కాలంలో ఒక కొత్త పింఛన్ కూడా ఇవ్వలేదన్నారు. తల్లికి వందనం పథకంలో కోత విధించడంతోపాటు 20 శాతం తల్లులకు అసలు డబ్బులు వేయలేదన్నారు. ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి అసలు అమలుకే నోచుకోలేదన్నారు.

మోసానికి ప్రతిరూపం కూటమి ప్రభుత్వం: కవురు

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఇప్పటికే అనేక విధాలుగా నష్టపోయారన్నారు. అవినీతి, లంచాలకు తావులేని ప్రభుత్వం జగనన్నదైతే మోసానికి ప్రతిరూపం కూటమి ప్రభుత్వానిదన్నారు. నరసాపురం పార్లమెంటు ఇన్‌చార్జి ముదునూరి మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ అన్ని వర్గాలు, కులాలు ప్రజలను మోసం చేసిన ఈ ప్రభుత్వానికి మనమంతా సినిమా చూపిద్దామన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేసే వరకు ప్రజల తరఫున మనమే పోరాటం చేయాలన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు గుణ్ణం నాగబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేక, అడిగిన వారిపై కేసులు పెడుతూ పబ్బం గడుపు కుంటుందని విమర్శించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ మాట్లాడుతూ మూడు పర్యాయాలుగా నిమ్మల రామానాయుడు నెగ్గితే నియోజకవర్గంలో అభివృద్ధి 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. మంత్రి నిమ్మలది ప్రచారార్భాటమే కానీ ప్రజల సంక్షేమానికి చేసిందేమీ లేదని విమర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, ఎంపీపీ వినుకొండ ధనలక్ష్మి రవికుమార్, వైస్ ఎంపీపీలు గొల్లపల్లి శ్రీనివాసరావు, కొప్పాడి శ్రీనుబాబు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు కవురు గోపి, పాలకొల్లు, పోడూరు జెడ్పీటీసీ సభ్యులు నడపన గోవిందరాజులునాయుడు, గుంటూరి పెద్దిరాజు నాయకులు పొత్తూరి బుచ్చిరాజు, ఓదూరి భాస్కరరావు, ఇలపకుర్తి నరసింహారావు, చల్లా విశ్వేశ్వరరావు, నిమ్మకాయల రామకృష్ణ, పెచ్చెట్టి కృష్ణాజీ, బొంతు వెంకట కర్ణారెడ్డి, రావూరి వెంకటరమణ బుజ్జి, మేడిది విజయ జ్ఞానమణి, మద్దా చంద్రకళ, పాలంకి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళపై కూటమి నేతల వేధింపులు

- కక్ష సాధింపులతో సర్పంచ్ చెక్ పవర్ రద్దు
- వైఎస్సార్ సీపీ నేతల ఆందోళన



పోడూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నేతల నిరసన

పెనుగొండ: కూటమి నేతలు రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ బీసీ మహిళా సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేయడం అన్యాయమని వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. పోడూరు మండలం పండిత విల్లూరు సర్పంచ్ ఇళ్ల లక్ష్మీ చంద్రిక చెక్ పవర్ పునరుద్ధరించాలంటూ బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ నేతలు ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. వైఎస్సార్ సీపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులకు విలువ నివ్వకుండా గ్రామాల్లో కూటమి నాయకులు పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించారు. 15వ ఆర్థిక సంఘ నిధులు సైతం కనీసం సర్పంచ్‌కు తెలియనివ్వకుండా ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు.

కన్నీరు పెట్టుకొన్న బీసీ మహిళా సర్పంచ్

కక్ష సాధింపులో భాగంగానే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ చెక్ పవర్ రద్దు చేశారని పండిత విల్లూరు సర్పంచ్ ఇళ్ల లక్ష్మీ చంద్రిక కన్నీరు పెట్టుకొన్నారు. పండిత విల్లూరు కనీసం పంచాయతీ సభ్యుడు కాని గణపతినీడి రాంబాబు తనను కించపరుస్తూ సర్పంచ్ కుర్చీలో కూర్చొని పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. అహంకారంతో «ప్రభుత్వం మాది.. మా మాటే వేదవాక్కు» అంటూ అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. ప్రశ్నించినందుకు ఆరోపణలు చేసి, అధికారులపై ఒత్తిడి తెచ్చి తన చెక్‌పవర్ రద్దు చేయించారన్నారు. బీసీ మహిళా సర్పంచ్ అని చూడకుండా స్థానిక ఎమ్మెల్యే పితాని దీనికి వత్తాసు పలికారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే పోరాటం తప్పదని వైఎస్సార్ సీపీ నాయకులు హెచ్చరించారు. నిరసనలో జెడ్పీటీసీలు గుంటూరి పెద్దిరాజు, కర్రి గౌరీ సుభాషిణి, ఆచంట, పోడూరు మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, గుబ్బల ఉషారాణి వీరబ్రహ్మం, సర్పంచ్‌లు మట్టాకుమారి, బుర్రా రవికుమార్, చుట్టగుళ్ల పూర్ణిమ, గొట్టుముక్కల సోనీయా, నామన వీర్రాజు, తమనంపూడి వీర్రేడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు, మండల కన్వీనర్లు పిల్లి నాగన్న, నల్లిమిల్లి వేణుబాబు, కర్రి వేణుబాబు, చింతపల్లి గురుప్రసాద్, గెద్దాడ ఏకలవ్య, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్షీరారామంలో రుద్రహోమం



రుద్రహోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా బుధవారం రుద్రహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 12 మంది దంపతులు పాల్గొని స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో పూజా కార్యక్రమాలు జరిపారు. హోమం అనంతరం భక్తులను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ పి వాసు, అర్చకులు వీర బాబు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం



పోలవరంలో పోలీస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరంలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని బుధవారం హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి వేగంగా సాగాలంటే శాంతిభద్రతల పర్యవేక్షణ అత్యంత ముఖ్యమైనదన్నారు. పోలీసు వ్యవస్థ బలోపేతానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ఈ భవనాల నిర్మాణ లక్ష్యమన్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ మొత్తం ఆమె పరిశీలించి వివరాలను డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు నుంచి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కేపీఎస్ కిషోర్, సీఐ బాల సురేష్, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

'ఓ రోజు శాస్త్రవేత్త అవుతారా'లో ఏలూరు విద్యార్థి



సర్టిఫికెట్ అందుకుంటున్న భార్గవ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దేశవ్యాప్తంగా 37 ప్రయోగశాలలో నిర్వహిస్తున్న 'ఓ రోజు శాస్త్రవేత్త అవుతారా' కార్యక్రమానికి ఏలూరు వెన్నవల్లి వారి పేటలోని సెయింట్ జోన్స్ హైస్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థి తంజంగారి భార్గవ్ సాయి హనుమ సీఎస్ఐఆర్ చెన్నై కేంద్రానికి ఎంపికయ్యాడు. బుధవారం చెన్నై అడయార్‌లోని సీఎస్ఐఆర్ కేంద్రంలో దక్షిణ భారత వ్యాప్తంగా విచ్చేసిన 75 మంది విద్యార్థులతో శాస్త్రవేత్తలతో పలు అంశాలకు సంబంధించిన విషయాలు తెలుసుకొని, వారిలో కలిగే ప్రశ్నలకు జవాబులు, సైన్స్ ల్యాబ్‌లో జరిగే ఎన్నో పరిశోధనలను పరిశీలించే కార్యక్రమంలో పాల్గొన్నాడు. విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు అందించారు.

కుళాయి కనెక్షన్లకు కూటమి వసూళ్లు

- గ్రామ అభివృద్ధి కమిటీ పేరుతో దందా
- రూ.11 వేల చొప్పున వసూలు
- గ్రామస్తుల మండిపాటు



తాడేరులో గ్రామాభివృద్ధి కమిటీ పేరుతో రూ.11 వేలు తీసుకొని ఇచ్చిన రసీదు

భీమవరం అర్బన్: మండలంలోని తాడేరు గ్రామంలో కూటమి నాయకులు గ్రామస్తులపై ప్రత్యేక పన్నులు వేసి డబ్బులు వసూలు చేస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. తాడేరు గ్రామంలో మొత్తం జనాభా 3,600 పైగా నివసిస్తున్నారు. వీరికి తాగునీటిని సరఫరా చేసేందుకు వెయ్యి కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. గ్రామస్తులకు అవసరమయ్యే తాగునీటిని పంచాయతీ అధికారులు సరిపెట్టలేకపోతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. గ్రామంలో ఎవరైనా కుళాయి కనెక్షన్ల కోసం పంచాయతీ ద్వారా అన్ని అనుమతులు పొందితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీకి రూ.4,100 చెల్లించాలి. గతంలో కొత్తగా కుళాయి కనెక్షన్లు పొందాలంటే మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేస్తేనే కాని అనుమతులు ఇవ్వమని పంచాయతీ అధికారులు గ్రామస్తులకు తెలియజేశారు. అయితే ఇప్పటికే గ్రామంలో తాగునీరు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేయకుండానే కొత్తగా 40 కుళాయి కనెక్షన్లు పంచాయతీ అధికారులు మంజూరు చేయడంపై గ్రామంలో తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

గ్రామాభివృద్ధి కమిటీ పేరుతో అదనపు వసూళ్లు

నూతనంగా కుళాయి కనెక్షన్ తీసుకోవాలంటే అన్ని అనుమతులు ఉంటే రూ.4,100 చెల్లిస్తే సరిపోతుంది. అయితే జనసేన నాయకులు గ్రామాభివృద్ధి కమిటీ పేరుతో మరో రూ.5,900 కలిపి మొత్తం రూ.11 వేలు కడితేనే నూతన కుళాయి కనెక్షన్ ఇస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రత్యేకంగా గ్రామాభివృద్ధి కమిటీ పేరుతో ఒక రసీదు బుక్కు తయారుచేయించి నాన్ లేఅవుట్లలో కుళాయి కనెక్షన్ పొందాలనుకునే వారి నుంచి రూ.11 వేలు, అన్ని అనుమతులు ఉండి కుళాయి కనెక్షన్ పొందాలనుకుంటే రూ.6 వేలు చొప్పున వసూలు చేసి జనసేన నాయకులు రసీదులు ఇస్తున్నారని చెబుతున్నారు. ఈ విధానం పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకమని, అధికార పార్టీ నాయకులు వసూళ్లు చేసి దోపిడీ చేస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అంతేకాకుండా అక్రమ వసూళ్లను గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వసూళ్లు చేసిన నగదును ఏ అభివృద్ధికి వినియోగిస్తారో.. ఎవరికి లెక్కలు చెబుతారో కూడా తెలియని పరిస్థితి.

గ్రామ కార్యదర్శి వివరణ

గ్రామాభివృద్ధి కమిటీ పేరుతో వసూళ్ల విషయమై గ్రామ కార్యదర్శి పార్వతిని వివరణ కోరగా ఆ కమిటీకి, పంచాయతీకి ఎలాంటి సంబంధం లేదని, కుళాయి కనెక్షన్‌కు అన్ని అనుమతులు ఉంటే రూ.4,100 చెల్లిస్తే మంజూరు చేస్తామని చెప్పారు.

ఆస్తి కోసం భార్యను చంపిన భర్త అరెస్టు



నిందితుడిని అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐలు

కైకలూరు, ఏలూరు టౌన్: చేపల చెరువు అమ్మకానికి భార్య అడ్డుపడుతోందని కక్ష పెంచుకుని కత్తితో అతి కిరాతకంగా హత్య చేసిన భర్తను కలిదిండి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను కలిదిండి పోలీసు స్టేషన్‌లో ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, సీఐ వి.రవికుమార్ వెల్లడించారు. కలిదిండి మండలం ఎస్ఆర్‌పీ అగ్రహారం శివారు కట్టావానిపాలెంకు చెందిన కట్టా పెద్దిరాజు(48), జయలక్ష్మి (44) భార్యభర్తలు. వీరికి ఇరువురు మగ సంతానం. గ్రామంలో 33 సెంట్లు చేపల చెరువును విక్రయించి వివాహం జరిగిన పెద్ద కుమారుడికి నగదు ఇవ్వాలని భార్య జయలక్ష్మి భావించింది. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొన్నిరోజుల క్రితం పెద్దిరాజు భీమవరంలో వైద్యం చేయించుకుని వస్తూ కాళ్ల మండలం, దొడ్డనపూడి గ్రామంలో కత్తిని కొనుగోలు చేసి ఇంటిలో దాచాడు. చెరువు విక్రయం విషయంలో ఈ నెల 9న రాత్రి భోజనం చేసిన తర్వాత భార్యభర్తలు గొడవపడ్డారు. ముందుగా తెచ్చుకున్న కత్తితో 10వ తేదీ తెల్లవారుజామున భార్యను విచక్షణ రహితంగా నరికి చంపాడు. తనపై దాడి జరుగుతుందని భావించి పురుగు మందు తాగి, చాకుతో పీకపై కోసుకుని ఆపై ఉరివేసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అతడిని 108 వాహనంలో ఏలూరు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కుమారుడు రాము ఫిర్యాదుపై కోలుకొని వచ్చిన తర్వాత పెద్దిరాజును అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో కలిదిండి ఎస్సై వి.వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన నారు

ఉద్యాన వర్సిటీ వీసీ కె.గోపాల్



నారును పరిశీలిస్తున్న ఉద్యాన వర్సిటీ వీసీ కె.గోపాల్

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీలోని విశిష్ట రక్షిత సాగు పరిశోధన శిక్షణా కేంద్రంలో తయారుచేసిన నారును రైతులకు అందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన వర్సిటీ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ తెలిపారు. ఈ కేంద్రం ద్వారా అందిస్తున్న నారు తదితర విషయాల గురించి బుధవారం వివరించారు. కూరగాయల ఉత్పత్తి నేలలో వ్యాధుల వల్ల దిగుబడి తగ్గుతుందన్నారు. ఇది రైతుల జీవనోపాధిని ప్రభావితం చేస్తుందన్నారు. కూరగాయల పెంపకంలో కొత్త పద్ధతి గ్రాఫ్టెడ్ ఖ్యాతి పొందిందన్నారు. అంటుకట్టిన కూరగాయల నారు ద్వారా నేల ద్వారా సంక్రమించే వ్యాధులు ఉండవన్నారు. వంగ, టమాటా, మిరప పంటలకు కావాల్సిన నారును వర్సిటీలోని విశిష్ట రక్షిత సాగు కేంద్రంలో పెంచుతున్నామని వీసీ చెప్పారు. అంటుకట్టిన నారును రైతుల అవసరాల మేర అందిస్తున్నామన్నారు. తెగుళ్ల నిరోధక శక్తి కలిగి, అంటు కట్టిన కూరగాయల నారు కావాలంటే 30 రోజులు ముందుగా ఈ కేంద్రంలో రైతులు తమ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. సంప్రదాయ టమాట, మిరప వంగడాల కంటే గ్రాఫ్టెడ్ వంగడాల వాడకం వల్ల దిగుబడులు 30 నుంచి 50 శాతం పెరిగాయన్నారు. వంగలో రెండింతల దిగుబడి పెరిగిందన్నారు. రైతులకు అంటు కట్టిన కూరగాయల మొక్కలు రూ.10కు ఇస్తామన్నారు. నారు కావాల్సిన వారు ఉద్యాన వన విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.రమేష్‌బాబు 94921 85716 నంబరులో సంప్రదించాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి



చందూ (ఫైల్)

ముసునూరు: గత రెండు రోజులుగా అదృశ్యమైన ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ముసునూరు ఎస్సై ఎ చిరంజీవి కథనం మేరకు మండలంలోని లోపూడి గ్రామానికి చెందిన బిలుగుది గోపాలరావు కుమారుడు చందూ(17) పదో తరగతి పాస్ అయ్యాడు. ఇటీవల ధర్మాజీగూడెంలోని ఓ ప్రైవేటు కాలేజీలో చేరగా కొద్ది రోజుల క్రితం అతని స్నేహితులు ఏలూరులో చదువుతున్నట్లు తెలుసుకుని అక్కడ కాలేజీలో చేర్చారు. అనంతరం తమ సమీప బంధువుల కుమార్తె ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలో చదువుతున్న విషయం తెలుసుకుని అక్కడ కాలేజీలో చేర్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కళాశాలలో ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి కొండపర్వలోని తన బంధువుల ఇంటికి వెళ్లి ఆదివారం వరకు అక్కడే ఉన్నాడు. సోమవారం కాలేజీకి బయలుదేరాడు. కాని అటు వెళ్లకుండా అమ్మమ్మ వాళ్ల గ్రామం రమణక్కపేట చేరుకున్నాడు. అక్కడ నుంచి సాయంత్రం వరకు చెక్కపల్లి, ధర్మాజీగూడెం గ్రామాల్లో సంచరించి రాత్రి 7 గంటలకు లోపూడి చేరుకుని అదృశ్యమయ్యాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బంధువుల గ్రామాల్లో గాలించినా చందూ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో సోమవారం సాయంత్రం ముసునూరు పోలీసులను ఆశ్రయించారు. కాగా బుధవారం తమ ఇంటి సమీపంలో ఉన్న ఖాళీ ఇంటిలోని టాయిలెట్‌లో విద్యార్థి ఉరి వేసుకుని మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మిథున్ రెడ్డి అక్రమ అరెస్టుకు ఖండన



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్ట్‌ను మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఖండించారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం వినతి పత్రం అందజేశారు. మంగరాజు మాట్లాడుతూ ఏపీలో అక్రమ అరెస్టుల పరంపర కొనసాగుతోందన్నారు. లేని లిక్కర్ కేసును బనాయించి వైఎస్సార్ సీపీని దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతోందన్నారు. కేవలం 28 రోజుల్లో ఒక స్టోరీని మసాల వేసి దట్టించి వండి, ఒక ప్రణాళిక ప్రకారం ఫిర్యాదు చేయించి, విచారణ కమిటీ వేసి రెవెన్యూ సెక్రటరీచే సీఐడీకి ఫిర్యాదు చేశారని చెప్పారు. అక్రమ అరెస్టులను ప్రజలు గమనించాలని కోరారు. మాలమహానాడు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీడీ అసభ్య ప్రవర్తనపై విచారణ



పీడీ అసభ్య ప్రవర్తనపై విచారణ చేస్తున్న డీవైఈఓ రవీంద్రభారతి

కలిదిండి (కై కలూరు): స్థానిక ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ కోటి రత్నదాస్‌పై బాలికలు, హెచ్ఎం చేసిన ఆరోపణలపై జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ ఆదేశాలతో డీవైఈఓ నిమ్మగడ్డ రవీంద్రభారతీ పాఠశాలలో బుధవారం విచారణ చేశారు. విద్యార్థినుల పట్ల పీడీ అసభ్యకర ప్రవర్తనపై మంగళవారం మీడియా ద్వారా వెలుగు చూసింది. హెచ్ఎం బి.స్వర్ణకుమారి, మరో 19 మంది ఉపాధ్యాయుల నుంచి ముందుగా రూపొందించిన ప్రశ్నావళిని డీవైఈఓ పూర్తి చేయించారు. బాలికల నుంచి పూర్తి వివరాలను తెలుసుకున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పీడీ రత్నదాసు నుంచి వివరణ తీసుకున్నారు. విచారణ నిమిత్తం పది రోజుల పాటు అతనితో ప్రేరేపిత సెలవు పెట్టించారు. విచారణ అధికారి రవీంద్రభారతీ మాట్లాడుతూ హెచ్ఎం, సహచర ఉపాధ్యాయులు, బాలికల నుంచి వివరాలు సేకరించామని, నివేదికను జిల్లా అధికారికి సమర్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కలిదిండి మండల ఎంఈవోలు రవిప్రకాష్, శ్రీనివాసరావు, ఐసీడీఎస్ కై కలూరు సెక్టార్ సీడీపీవో డాక్టర్ ఎస్.దీప్తి, ఏలూరు ఐసీడీఎస్ సాంస్థగతేతర సంరక్షణ అధికారి(పీవోఎన్ఐసీ) జయలక్ష్మి, పాఠశాల హెచ్ఎం బి.స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలిలో కిషోర్ మృతదేహం

ముసునూరు: తాపీ పని ముగించుకుని ఇంటికి తిరిగి వెళుతున్న వ్యక్తిని ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబళించింది. వివరాలిలా ఉన్నాయి.. నూజివీడు పట్టణంలోని కుమ్మరి పేటకు చెందిన చెరుకుమిల్లి కిషోర్ (45) చెక్కపల్లి పరిసర ప్రాంతాల్లో తాపీ పనులు చేస్తూ సాయంత్రానికి ఇంటికి చేరుకుంటూ ఉంటాడు. కాగా బుధవారం సాయంత్రం ఎప్పటి మాదిరిగానే పనులు ముగించుకుని చెక్కపల్లి నుంచి బైక్‌పై నూజివీడు తిరిగి వెళుతున్న సమయంలో వ్యవసాయ సొసైటీ సమీపంలోకి చేరుకోగానే, చింతలవల్లి వైపు నుంచి జామాయిల్ లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై ఎం.చిరంజీవి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

విద్యుత్ మీటరు బిగింపుతో సమస్య పరిష్కారం



నన్నేటి పుష్పరాజ్ సమక్షంలో డొల్ల విజయలక్ష్మి ఇంటికి విద్యుత్ మీటరు బిగించిన విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ

యలమంచిలి: కనకాయలంక పంచాయతీ డొల్లవారిపేటకి చెందిన డొల్ల విజయలక్ష్మి ఇంటికి బుధవారం విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ మీటర్ బిగించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల ఒత్తిడితో పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు నాలుగు రోజుల క్రితం ఆ మీటరు తొలగించారు. దీంతో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ, జనసేన నాయకులు ఆందోళన చేశారు. ఈ క్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ బుధవారం కనకాయలంక వెళ్లి పంచాయతీ కార్యదర్శి అనుమతితో విద్యుత్ మీటర్ ఏర్పాటు చేసినా కనీసం నోటీస్ ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారులు వైఖరి మార్చుకొని ఎక్కడైతే మీటర్ తొలగించారో అదే స్థానంలో మీటర్ ఏర్పాటు చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దీంతో విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ వెంటనే మీటరు బిగించడంతో సమస్య పరిష్కారమైంది. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షుడు నేతల సాల్మన్ రాజు, గ్రామస్తులు పినిపే పెద్దిరాజు, గూటం వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, సరేళ్ళ రాజు, గుడిసె శ్రీను, పైడి వెంకటేష్, సరేళ్ళ తేజ, పినిపే ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

ఏలూరు (టూటౌన్): బావను హత్య చేసిన కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఏలూరు జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి యు.ఇందిరా ప్రియదర్శిని బుధవారం తీర్పును వెలువరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లా మచిలీపట్నం ఫిష్ మార్కెట్ సమీపంలో నివాసముంటున్న ఎల్లమ్మకు విజయవాడ సింగ్ నగర్ న్యూరాజేశ్వరి పేటకు చెందిన పవర్ రాజేష్‌తో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. కొన్నేళ్లు వీరి కాపురం సజావుగానేసాగింది. అనంతరం రాజేష్ తన భార్య ఎల్లమ్మ చెల్లెలు నందినితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీంతో రాజేష్‌కు, ఎల్లమ్మకు మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలోనే ఎల్లమ్మ తన తమ్ముడైన తంగా పాండ్యన్‌తో కలిసి ఏలూరు వెంకటాపురం చెంచుల కాలనీకి వచ్చి నివాసం ఉంటుంది. మే 20, 2021న రాజేష్ చెంచుల కాలనీకి వచ్చి తన భార్య ఎల్లమ్మతో గొడవ పడి కొట్టాడు. దీంతో ఎల్లమ్మ తమ్ముడు పాండ్యన్ మా అక్కను కొడతావా అంటూ రాజేష్‌తో గొడవపడ్డాడు. మేదర కత్తితో రాజేష్ మెడ వెనుక పలుమార్లు నరకటంతో రక్తపు మడుగులో పడి రాజేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు పాండ్యన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు తుది విచారణలో జడ్జి ఇందిరా ప్రియదర్శిని ముద్దాయికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పును వెలువరించారు. మహిళాపోలీస్ స్టేషన్ సీఐ, కోర్టు మానిటరింగ్ సెల్ సీఐ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో సకాలంలో సాక్షులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టి విచారణకు సహకరించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చింతమనేని రమేష్ తన వాదనలు వినిపించారు.

26న జూనియర్ బాలుర బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్: ఈ నెల 26వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జూనియర్ బాస్కెట్‌బాల్ బాలుర జట్టు ఎంపిక పోటీలు చేపట్టనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. అలంపురం వద్ద ప్రత్తిపాడు సరస్వతి విద్యాలయ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ ఆవరణలో మధ్యాహ్నం 3 గంటలకు జట్టు ఎంపిక జరుగుతందన్నారు. 2007 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టిన వారు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఆగస్టు 14 నుంచి 17 వరకూ పిఠాపురంలో జరిగే అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. వివరాలకు అసోసియేషన్ కోశాధికారి కె మురళీకృష్ణ 94411 71933 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

పెదపాడు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులకు బోధన అందించాలని డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం పెదపాడు మండలంలోని కొత్తూరు జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలను ఆమె సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించారు. అనంతరం పాఠశాలకు హాజరుకాని పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులను ట్రాన్సిషన్, బాల్య వివాహాలు వంటి విషయాలపై అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనశాలను పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పాఠశాల ఎన్‌రోల్‌మెంట్ పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. బడికిరాని పిల్లలను బడికి వచ్చేలా తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు మురళీకృష్ణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైవీ శరత్‌బాబు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై అపోహలొద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపుపై ఎటువంటి అపోహలు అవసరం లేదని, వీటి వల్ల వినియోగదారులపై ఎలాంటి అదనపు చార్జీల భారం ఉండదని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎ రఘునాథబాబు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఏపీఈఆర్సీ రెగ్యులేషన్ 2021 ప్రకారం ప్రభుత్వ, వాణిజ్య కేటగిరీల వినియోగదారులకు వీటిని బిగిస్తున్నామని చెప్పారు. వీటితో పాటు ఎక్కువ విద్యుత్ వినియోగం కలిగిన (హై వేల్యూ) గృహ వినియోగదారులకు కూడా అమర్చుతున్నామని తెలిపారు. స్మార్ట్ మీటర్లను అమర్చే ముందు వాటి ప్రత్యేకతలు, ప్రయోజనాలపై విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

టీచర్ మృతి కేసుపై పకడ్బందీగా దర్యాప్తు

దెందులూరు: చొదిమెళ్ల శ్రీవల్లి అపార్ట్‌మెంట్స్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన టీచర్ దేవిక కేసును పకడ్బందీగా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఏలూరు రూరల్ ఎస్సై దుర్గ ప్రసాద్ చెప్పారు. టీచర్ పోస్టుమార్టం రిపోర్ట్ ఇంకా రావాల్సి ఉందన్నారు. అల్లుడు, కుమార్తె అన్యోన్యంగానే ఉంటారని, చెప్పుకోదగ్గ గొడవలు ఏమి వారిద్దరి మధ్య లేవని, మరణం మాత్రం అనుమానంగా ఉందని దేవిక తండ్రి, రిటైర్డ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దేవిక భర్త కాల్ డేటా దర్యాప్తులో కీలకంగా మారింది.

'రాజు గాని సవాల్' చిత్ర బృందం సందడి



చిత్ర బృందానికి స్వాగతం పలుకుతున్న డిస్ట్రిబ్యూటర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాజు గాని సవాల్ చిత్ర బృందం బుధవారం ఏలూరులో సందడి చేసింది. స్థానిక సత్యనారాయణ థియేటర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కథానాయకుడు లెలిజాల రవీందర్ మాట్లాడారు. తన జీవితంలో జరిగిన కొన్ని ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించామన్నారు. ఆగస్టు 8న విడుదల కానుందని తెలిపారు. హీరోయిన్ రితిక చక్రవర్తి మాట్లాడుతూ తాను ఇప్పటివరకు తమిళ చిత్రాల్లో నటించగా తెలుగులో తనకి ఇది మూడో చిత్రమన్నారు. డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలికపై లైంగిక దాడికి యత్నించిన భానుతేజ అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున భీమవరం బేతనిపేటకు చెందిన బాలిక గదిలోకి భానుతేజ చొరబడి ఆమెపై లైంగిక దాడికి యత్నించగా బాలిక కేకలు వేయడంతో పారిపోయాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

బావ, బావమరిదులకు తీవ్ర గాయాలు

భీమడోలు: జాతీయ రహదారి సూరప్పగూడెం ఫ్లై ఓవర్ వంతెన వద్ద బుధవారం ఓ లారీ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెంకు చెందిన ముదరబోయిన కొండయ్య, తాడిశెట్టి రామకృష్ణ బావ, బావమరుదులు. వీరు బుధవారం కుటుంబ పనుల నిమిత్తం బైక్‌పై విజయవాడ వెళ్తున్నారు. సూరప్పగూడెం ఫ్లైఓవర్ వంతెనపై వెళ్తూ రాంగ్ రూట్‌లో డివైడర్ దాటుతుండగా ఏలూరు నుంచి రాజమండ్రి వైపు వస్తున్న లారీ ఆ బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బావమరుదులూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో కొండయ్య పరిస్థితి విషమంగా ఉంది. భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు



భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని భవిత కేంద్రంలో బుధవారం డాక్టర్ అల్లు శ్రీకృష్ణ మహేష్ బాధితులకు ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే సమస్యను గుర్తించి ప్రతి రోజూ క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ అందిస్తే దివ్యాంగ పిల్లలు వారి సమస్యలను అధిగమించగలుగుతారని చెప్పారు. మేనరిక వివాహాలను ప్రోత్సహించవద్దని, గర్భిణులు అనుభవజ్ఞులైన వైద్యుల సూచనలు, సలహాలు తప్పక పాటించాలని తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏవో ప్రసాద్

భీమవరం అర్బన్: వరి నాట్లు పూర్తయిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ రైతులకు సూచించారు. భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలో బుధవారం ఈ-క్రాప్ నమోదును ఏవో ప్రసాద్ పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదులో రైతులు తమ పంట రకం, రైతు వివరాలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇలా చేయడం ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు పంట నష్ట పరిహారం, మద్దతు ధరకే ధాన్యం విక్రయించుకోవడానికి, ఇతర ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందడానికి ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు

ఎక్సైజ్ అధికారుల దాడులు

కాళ్ల: ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారంగా మద్యం అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆకివీడు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కాళ్ల మండలం కలవపూడి శివారు మోడి గ్రామంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. అనధికారంగా మద్యం అమ్ముతున్న గుడాల కాంతమ్మను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద 6 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆకివీడు ఎక్సైజ్ ఎస్సై వి.కరుణ ప్రియ తెలిపారు.

నేటి నుంచి ఎన్‌ఎల్‌ఎం బృందం పర్యటన

ఆకివీడు: మండలంలో ఈ నెల 24వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకూ ఎన్‌ఎల్‌ఎం బృందం పర్యటిస్తుందని ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నోడల్ బృందానికి సంబంధిత మండల స్థాయి అధికారులు రికార్డులతో సహకరించాలన్నారు. ఎన్ఎల్ఎం బృందం ఉపాధి హామీ పనులు, జాబ్‌కార్డు ఉన్న 10 మందితో మాట్లాడటం, వారంలో ఒకరోజు పని వివరాలు అడుగుతారని తెలిపారు. ఆడిట్ రిపోర్టులు తనిఖీ చేస్తారన్నారు. 3 సంవత్సరాల్లో జరిగిన 15 పనులను పరిశీలిస్తారని చెప్పారు. మండలంలోని రాజులపేట, అప్పారావుపేట, దుంపగడప, సిద్ధాపురం, చినమిల్లిపాడు, కుప్పనపూడి గ్రామాలను సందర్శిస్తారని ఎంపీడీఓ తెలిపారు.

పీ4పై పునః సర్వే

పాలకోడేరు: మండలంలోని గొరగనమూడి గ్రామంలో పీ4పై బుధవారం మండల పరిషత్ కార్యాలయ అధికారుల బృందం పునః సర్వే నిర్వహించారు. అనంతరం గ్రామ సర్పంచ్ గొట్టుముక్కల శివాజీ రాజు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 15 నిరుపేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎంపిక చేశారు. గ్యాస్ లేనివారిని, విద్యుత్ కనెక్షన్ లేని వారిని, ఉద్యోగం, పింఛన్, అద్దెలు వంటి ఆదాయం లేని కుటుంబాలను, తాగునీటి కొళాయి కనెక్షన్ లేని కుటుంబాలను, బ్యాంకు ఖాతా లేని కుటుంబాలను బంగారు కుటుంబాలుగా అర్హతగా నిర్ణయించారు. ఈ సర్వేలో పాల్గొన్న డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు మాట్లాడుతూ బంగారు కుటుంబాలను ఎంపిక చేశామని కొంతమంది దత్తత తీసుకొని ఈ కుటుంబాలను అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తారని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నాగలింగాచారి, ఎంపీడీవో వి.రెడ్డియ్య, డ్రెయినేజీ ఏఈ దుర్గారావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన

భీమవరం (ప్రకాశంచౌక్): విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని ట్రాఫిక్ సీఐ వి.శ్రీనివాసరావు సూచించారు. తిరుమల విద్యా సంస్థల్లో బుధవారం ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు వాహనాలు నడిపేందుకు విధిగా లైసెన్సులు పొందాలని సూచించారు.

సూపర్ సిక్స్.. మోసం ఫిక్స్

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని మంత్రి అచ్చంనాయుడే బహిరంగ సభలో అనడం సిగ్గుచేటని, ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాకపోయినా సూపర్ సిక్స్–మోసం ఫిక్స్ అనేలా ప్రజలను మోసం చేశారని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ పట్టణ విస్తృత స్థాయి సమావేశాన్ని పార్టీ పట్టణ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు అధ్యక్షతన స్థానిక గుణం ఫంక్షన్ హాలులో బుధవారం నిర్వహించారు. ఈ సభలో మాజీ మంత్రి కొట్టు మాట్లాడుతూ చంద్రబాబు ష్యూరిటీ ఇస్తే మోసం గ్యారెంటీ అని ప్రజలే వ్యాఖ్యానిస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్ హామీలతో రాష్ట్ర ప్రజలను పురోగతిలోకి తీసుకువస్తామని చెప్పిన చంద్రబాబు ఒక్క హామీని నూరు శాతం అమలు చేయకపోవడం బాబు చేతకానితనానికి ప్రతీక అని అన్నారు. ప్రభుత్వ విద్య, వైద్య వ్యవస్థలను నీరుగార్చిన అసమర్థుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. సొమ్ములు దండుకొనేందుకు వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేసిన అవినీతిపరుడు చంద్రబాబు అని ఆరోపించారు. రోజుకో కొత్త మాటలతో నిలకడలేని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ హామీలను అమలు చేయకపోవడంపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

నియోజకవర్గంలో తారాస్థాయికి అవినీతి

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో రాష్ట్ర స్థాయిలో అవినీతి సాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేకాట, కోడిపందేలు, దాబాలు, బెల్ట్ షాపులు తదితర అసాంఘిక వ్యాపారాల ద్వారా సొమ్ములు దండుకునేందుకు కొన్ని టీములను ఏర్పాటు చేసుకుని ప్రజాప్రతినిధులు ఉన్నారన్నారు. నమ్మిన వారిని మోసం చేయడంలో ఇక్కడి కూటమి నాయకులు చంద్రబాబును మించిపోయారని వ్యాఖ్యానించారు. ప్రజాజీవనానికి విఘాతం కలిగిస్తున్నా పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రెడ్‌బుక్ పాలనకు ప్రభుత్వం యంత్రాంగం తలవంచిందని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా, మాజీ ఉపముఖ్యమంత్రిగా నియోజవర్గంలో అభివృద్ధి పనులను మంజూరు చేసి శంకుస్థాపనలు చేస్తే వాటికి కొబ్బరికాయలు కొట్టి తామే పనులు చేయిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రజాప్రతినిధులు ఆలోచించుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ ఆదేశాలను అనుసరించి చంద్రబాబు మేనిఫెస్టో ద్వార ప్రజలకు ఎంతవరకు లబ్ధి చేకూరింది? నష్టం ఏంటి? అనే అంశాలపై ఇంటింటి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి చంద్రబాబు అవినీతి పాలను, నియోజకవర్గంలో అరాచక నాయకుల విధానాలను ప్రజలకు తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో కర్రి భాస్కరరావు, చెన్నా జనార్దన్, రఫీ, బొద్దాని శ్రీనివాస్, చిటికన ప్రసాద్, ముప్పిడి సంపత్‌కుమార్, గుండుమోగుల సాంబయ్య, చామన సూర్యచంద్రరావు, కైగాల శ్రీనివాస్, తమ్మిశెట్టి చుక్కయ్య, జిడ్డు హరిబాబు, గార్లపాటి వీరకుమార్, పాలూరి శివ, షేక్ హుస్సేన్‌బీబీ, తాడిపత్రి రజని, పత్సమట్ల సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావుకు పరామర్శ



మరపట్ల సుబ్బారావును పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మరపట్ల సుబ్బారావు తల్లి సావిత్రి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబాన్ని బుధవారం మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. సావిత్రి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె కుటుంబానికి తన సానుభూతి తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు ముప్పిడి సంపత్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు, నియోజకవర్గ మీడియా కన్వీనర్ బొద్దాని శ్రీనివాస్, దండే గోతియ్య, దాకే పండియ్య తదితరులు ఉన్నారు.

బాబు మాటలకు మోసపోయిన ప్రజలు



తణుకులో కూటమి ప్రభుత్వ మోసాన్ని మహిళకు వివరిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: చంద్రబాబు అబద్ధాలు, మోసపూరిత వాగ్దానాలకు ప్రజలు ఎప్పటికప్పుడు మోసపోతూనే ఉన్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 12, 13 వార్డుల్లో బుధవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సూపర్‌సిక్స్‌తో పాటు 175 హామీలను చంద్రబాబు ఎన్నికల ముందు ప్రజలకు వాగ్దానాలిచ్చి నేడు అరకొరగా తల్లికి వందనం వేసి అన్నీ ఇచ్చేశానని అంటుంటుంటే మంత్రి అచ్చెన్నాయుడు మరో అడుగు ముందుకేసి ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మేయాలని అంటున్న తీరు ప్రజలను ఏరకంగా మోసం చేస్తున్నారో గ్రహించాలని కోరారు. సంక్షేమ పథకాలు ఇవ్వకుండా చేస్తున్న అప్పుల తాలూకా డబ్బు ఏం చేస్తున్నారు? అని నిలదీశారు. వంచన, మోసం, అబద్ధం అనే మాటలకు నిలువెత్తు నిదర్శనం చంద్రబాబేనని స్పష్టం చేశారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్తున్న క్రమంలో ప్రజలు కూటమి ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారని, జగన్ ప్రభుత్వంలో ఎన్నో పథకాల రూపంలో డబ్బు అందేదని కానీ నేడు కూటమి నేతలే దోచేసుకుంటున్నారని చెబుతున్నారని అన్నారు.

తణుకులో బీసీలకు అన్యాయం

తణుకులో బీసీ వర్గాలకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ గతంలో తీరని అన్యాయం చేశారని, నేడు కూడా అదే ధోరణి కొనసాగిస్తున్నారని విమర్శించారు. నేను మంత్రిగా ఉన్న సమయంలో బీసీ వర్గాలకు వేల్పూరులో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు చేస్తే కోర్టుల ద్వారా అడ్డుకున్నారని దుయ్యబట్టారు. ప్రస్తుతం కూడా బీసీ వర్గాలను పక్కను పెట్టి తన వర్గాన్ని మాత్రమే అందలమెక్కిస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యదర్శి వడ్డూరి సీతారాం, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ నత్తా కృష్ణవేణి, తణుకు పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెనుమాక రాజేష్, మెహర్ అన్సారీ, నూకల కనకదుర్గ, మమత, జల్లూరి జగదీష్, దొరబాబు, ఎస్వీ జాకబ్‌బాబు, దిడ్ల సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణం సక్రమంగా చేపట్టాలి



అత్తిలిలో గంటావారివీధిలో డ్రెయిన్ నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం



అత్తిలిలో కళాశాల ప్రహరీ వెంబడి ఉన్న పాత డ్రెయిన్

అత్తిలి: మురుగు డ్రెయిన్ నిర్మాణ పనులు వాలుకు వ్యతిరేక దిశలో చేపట్టారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్తిలి గ్రామంలో గంటావారి వీధి నుంచి బాదరాలవారివీధిలోకి గ్రామ పంచాయతీ నిధులు రూ. 3 లక్షలతో డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. సుమారు 70 మీటర్ల పొడవునా సీసీ రోడ్డు వెంబడి డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టారు. కొత్తగా నిర్మిస్తున్న డ్రెయిన్ ద్వారా వచ్చే మురుగునీరు కళాశాల ప్రహరీకు ఆనుకుని ఉన్న పాత మురుగునీటి డ్రెయిన్‌కు అనుసంధానం చేశారు. అయితే కొత్తగా నిర్మించే డ్రెయిన్‌ద్వారా మొత్తం గంటావారివీధి నుంచి వచ్చే మురుగునీరు వెళ్లడానికి వాలు లేదని, పల్లపు ప్రాంత నుంచి మెరకపైపునకు మురుగునీరు బయటకు ఎలా వెళుతుంది? అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో మాదిరిగా గంటావారివీధిలో పాత డ్రెయిన్ ద్వారా మురుగునీరు వెళ్లేవిధంగా, కొత్తగా నిర్మించే డ్రెయిన్ మురుగునీరు సరైన వాలు ఏర్పాటు చేసి బాదరాలవారివీధి డ్రెయిన్‌కు అనుసంధానించేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాడి పశువులతో అధిక ఆదాయం



అత్తిలిలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి మురళీకృష్ణ

అత్తిలి: పాడిపశువులను సంరక్షించడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చని మండల ప్రత్యేక అధికారి కె.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని వరిఘేడు, అత్తిలి గ్రామాల్లో నిర్వహించిన ×పొలం పిలుస్తోంది¤ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పశుసంవర్ధక శాఖ ద్వారా అందుబాటులో ఉన్న వివిధ పథకాలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి టీకే రాజేష్ మాట్లాడుతూ ఆగస్టు 15 లోపు పంటల బీమా ప్రీమియాన్ని చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టేట్ టీచర్స్ యూనియన్ పట్టణ నూతన కమిటీ ఎన్నిక



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న పట్టణ నూతన కమిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టీయూ) పట్టణ నూతన కమిటీ ఎన్నిక బుధవారం స్థానిక ఈవీఎం స్కూల్‌లో ఏకగ్రీవంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి, పట్టణ ఇన్‌చార్జి వేదాల ఉదయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా కొడమంచిలి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా తన్నీరు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా కంకిపాటి గంగరాజు, జాయింట్ సెక్రటరీగా నూకారపు వెంకటేశ్వరరావు, కోశాధికారిగా లక్కింశెట్టి సునీత, మహిళా కార్యదర్శిగా మారం రేణుకాదేవి, జాయింట్ సెక్రటరీగా జవ్వాది సునీతలను ఎన్నుకన్నారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ మునిసిపల్ స్కూల్స్‌లోని అపరిష్కృతంగా ఉన్న టీచర్ల సమస్యలపై పరిష్కరించే విధంగా ప్రయాణం చేద్దామన్నారు. అనంతరం ఎస్‌టీయూ క్యాలెండర్లను ఆవిష్కరించారు.

ఆకు కూరలతోనే పోషకాలు

పాలకోడేరు: పోషణ కార్యక్రమంలో భాగంగా మోగల్లు అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో పెంచిన కూరగాయలను బుధవారం గర్భిణులకు, బాలింతలకు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ ఆకు కూరలతోనే పోషకాహార లోపం సమస్య తీరుతుందని వారికి అవగాహన కల్పించారు.

బలుసులమ్మకు ఆషాఢ సారె సమర్పణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ తల్లికి తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారికి సారె సమర్పించారు. బుధవారం ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారికి వివిధ రకాల మిఠాయిలు, ఫలాలు, పుష్పాలను సమర్పించారు. ఆలయ నిర్వాహకులు శ్రీరంగం అంజి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజా సమస్యలు తెలియజేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజాసమస్యలు ఫైల్ రూపంలో అందజేస్తే వాటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. బుధవారం సాయంత్రం మండలంలోని మారంపల్లి గ్రామంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక గ్రామసభ నిర్వహించారు.

పింఛన్ల డ్యూటీ వేయవద్దని వినతి



ఎంపీడీఓ ఎం.విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆశా వర్కర్లకు డ్యూటీ వేయవద్దని ఆశా వర్కర్ల యూనియన్ మండల కన్వీనర్ జి.దుర్గాభవాని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గాభవాని మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ సమయంలో గర్భిణుల దగ్గర ఉండాల్సిన పరిస్థితి వస్తే ఇబ్బందులుపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమపై ఉన్నతాధికారులు వెంటనే పని ఒత్తిడిని తగ్గించాలన్నారు. సీఐటీయు నాయకులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ చిరుద్యోగులైన స్కీమ్ వర్కర్లపై అదనపు పని భారం మోపి ఒత్తిడి చేయడం తగదన్నారు. తక్షణమే డ్యూటీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎంపీడీఓ విశ్వనాథ్ స్పందిస్తూ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు ఎం.దేవి, పి. అనంతలక్ష్మి, ఎ.వెంకటలక్ష్మి, నాగరత్నం పాల్గొన్నారు.

కార్పెంటర్స్ ఆధునిక నైపుణ్యాన్ని అందుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న యాక్షన్ టెసా సంస్థ ప్రతినిధులు

తణుకు అర్బన్: ప్రస్తుత కంప్యూటర్ యుగంలో వస్తున్న ఆధునిక నైపుణ్యాన్ని కార్పెంటర్స్ సద్వినియోగం చేసుకుని వృత్తిలో ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని టెసా సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ వై.జనార్దనరెడ్డి అన్నారు. కార్పెంటర్స్ డే పురస్కరించుకుని తణుకు చిట్టూరి హెరిటేజ్ హోటల్‌లో బుధవారం యాక్షన్ టెసా సంస్థ నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇంటి నిర్మాణాల్లో కార్పెంటర్ పనితీరులో హస్తకళ ఎంతో ఉట్టిపడుతుందని స్పష్టం చేశారు. అలాంటి కార్పెంటర్స్ అంతా నేటి ఆధునిక యుగంలో తమ నైపుణ్యానికి తోడు మార్కెట్‌లోకి అందుబాటులోకి వస్తున్న పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పనిముట్లు వినియోగించడంలో మెళకువలను తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులతోపాటు తణుకు కార్పెంటర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ బిన్నీబాబు

వీరవాసరం: వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి, అధిక దిగుబడులు సాధ్యమవుతాయని మండల వ్యవసాయ అధికారి బిన్నీబాబు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం బలుసులగొయ్యిపాలెం, పంజా వేమవరం గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రుణం తీసుకోని రైతులు తక్షణమే ఎకరాకు 210 రూపాయలు చెల్లించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో నమోదు కావాలని తెలిపారు. వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ప్రీమియం భారం.. బీమాకు రైతన్న దూరం

పంటల బీమాకు స్పందన కరువు



ట్రాక్టర్‌తో దుక్కు దున్నుతున్న రైతు (ఫైల్)

పెంటపాడు: భూమిలో విత్తు నాటినది మొదలుకొని పంట చేతికి వచ్చేవరకు అన్నదాతలకు అడుగడుగునా అవాంతరాలే. వాటిని అధిగమిస్తూ, కష్టనష్టాలను భరిస్తూ ముందుకు సాగాలి. విత్తనం దొరక్క, ఎరువుల కొరత, భారం, సాగునీటి కష్టాలు, తుపానులు, ప్రకృతి వైపరీత్యాలు, యంత్రాల వినియోగం, పంట చేతికొచ్చే వరకు సొమ్ములు రావడం ఇలా ప్రతి పనీ రైతుకు ఆటంకమే. ఎన్నో సుడిగుండాలు దాటాలి. కష్టపడే రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం వారి నిలువునా మోసం చేసింది. గత వైస్సార్ ప్రభుత్వంలో రైతులకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు ఎంతో అండగా నిలిచారు. పంట సాగు నుంచి చేతికి సొమ్ము వచ్చేవరకు జగనన్న తోడున్నారు. వాటిలో పంటల బీమా గురించి ప్రధానంగా చెప్పాలి. రైతుల తరఫున జగనన్న ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించేది. కేవలం రైతుల నుంచి రూపాయి మాత్రమే ప్రీమియంగా వసూలు చేసేవారు. దీంతో ఆ ఐదేళ్లు రైతులకు పూర్తి భరోసా లభించింది. కానీ నేటి కూటమి ప్రభుత్వం బీమా ప్రీమియం భారాన్ని రైతులపై మోపింది. దీంతో కొంతమంది మాత్రమే బీమా కట్టారు.

అన్నదాతల ఆవేదన

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అనేక హామీలు గుప్పించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని వాగ్దానం చేశఋూరు. తీరా అధికారంలోకి వచ్చినా ఆ ఊసే మరిచారు. అలాగే పంటల బీమా పథకాన్ని రైతులే కట్టుకోవాలని ఉత్తర్వులు జారీ చేశఋూరు. జగనన్న ప్రభుత్వంలో ఉచితంగా పంటల బీమా పొందిన రైతులందరూ చంద్రబాబు తీరుతో గగ్గోలు పెడుతున్నారు. అసలే పెట్టుబడి సాయం లేక ఇబ్బంది పడుతుంటే ఇక బీమా ప్రీమియం ఎలా కట్టాలి? అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పందన కరువు

పెంటపాడు మండలంలో 21 వేల ఎకరాలకు గాను కేవలం కొద్ది మంది రైతులు మాత్రమే ప్రీమియం కట్టారు. గత టీడీపీ ప్రభుత్వ కాలంలో రైతులు పంటల బీమా చెల్లించినా నష్టం జరిగిన ఏనాడూ పరిహారం దక్కిన పరిస్థితులు లేవు. ఇక ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితే ఉంటుందనే రైతులు భావిస్తున్నారు. దీంతో ఎక్కువ మంది రైతులు గడువు పొడిగించి నప్పటికీ వారి నుండి స్పందన కరువైంది.